

మంత్రి ఉంటే ఆ మార్గం మూతే..!

స్త్రీ శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నివాసముంటున్న సాలూరులోని అఫీషియల్ కాలనీ వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

- 8లో



గురుకులంలో ఇంటర్ విద్యకు మంగళం

- 8లో

'చీపురుపల్లిలోని గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ రెగ్యుల్ తరగతులను నిలిపివేశారు.

ఒక్క రోజు ఎస్ఐగా ఖాన్



విజయనగరం క్రైమ్: విశాఖ పోలీస్ రేంజ్ పరిధిలో నలుగురు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి లభించింది. ఇందులో భోగాపురం ఏఎస్ఐ సర్దార్‌ఖాన్ ఒక్క రోజు ఎస్ఐ ఉద్యోగంలో కొనసాగనున్నారు. ఆయన ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

పెదపెంకి.. మూత'బడి'!



మూతపడి ఉన్న పెదపెంకి-1 పాఠశాల

సాక్షి, పార్వతీపురం మన్యం: బలిజిపేట మండలం పెదపెంకి-1 పాఠశాల కొద్దిరోజులుగా మూతపడే ఉంటోంది. 3, 4, 5 తరగతులను మరోచోటకు విలీనం చేయడాన్ని నిరసిస్తూ, కొద్దిరోజులుగా పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేస్తున్న విషయం విదితమే. వీరి ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో 1, 2 తరగతులకు కూడా విద్యార్థులను గ్రామస్తులు పంపడం లేదు. ఉపాధ్యాయులు వస్తున్నా పిల్లలెవరూ రాకపోవడంతో పాఠాలు సాగని పరిస్థితి. శనివారం ఇన్‌చార్జి డీఈఓ రాజ్‌కుమార్ గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. అధికారులెంత ప్రయత్నాలు చేస్తున్నా.. తమ విద్యార్థులను మరో పాఠశాలకు భయంభయంగా పంపలేమని వారు స్పష్టం చేస్తున్నారు.

సజావుగా వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలు



బదిలీ ప్రక్రియ చేపడుతున్న సిబ్బంది

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియ శనివారం సజావుగా సాగింది. ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుడు ఆర్.కృష్ణవేణి, సూపరింటెండెంట్ కె.దేష్, ఏటీడబ్ల్యూఓ కె.చంద్రబాబు ఆధ్వర్యంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియ జరిగింది. బదిలీల్లో 56 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లకు స్థాన చలనం కలిగింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనలకు లోబడి బదిలీ ప్రక్రియ చేపట్టినట్టు కృష్ణవేణి తెలిపారు.

గిరిజన విద్యార్థులు విద్యాభ్యాసానికి దూరం కారాదు

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు



విజయనగరం అర్బన్: ఉపాధ్యాయులు లేక అరకు మండలంలో తేరు పంచాయతీ పరిధిలోని వంతులగుడ, తోడుబంద, ఈడారి, దంసానివలస, బొరకాలవలస, లండిగుడ, కాగువలస, తదితర పాఠశాలలు ఇప్పటికీ తెరుచుకోలేదన్న వార్తలపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు స్పందించారు. మీడియాతో శనివారం మాట్లాడుతూ సంబంధిత అధికారులు గిరిజన విద్యార్థులు విద్యావకాశాలను కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లోని బడి ఈడు పిల్లలందరూ విద్యనభ్యసించేలా చూడాలన్నారు. ఆయా గ్రామాల్లో విద్యార్థుల పాఠశాల విద్యపై క్షేత్రస్థాయిలో విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమైనందున విద్యార్థులు పాఠశాలలకు వచ్చి చదువుకునేలా చూడాలన్నారు.

తల్లీబిడ్డలకు ఎఫ్ఆర్ఎస్ కష్టాలు



ఎఫ్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్‌కు ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చిన తల్లీబిడ్డలు

సీతంపేట: మన్యంలోని తల్లీబిడ్డలకు ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం) రిజిస్ట్రేషన్ కష్టాలు వెంటాడుతున్నాయి. సిగ్నల్ లేకపోవడంతో పిల్లలను చంకన ఎత్తుకుని కొండలు దిగి సీతంపేట ఐసీడీఎస్ కార్యాలయానికి తరలివస్తున్నారు. యాప్‌లో నమోదు కాకపోతే వచ్చేనెలలో పోషణ పథకంలో భాగంగా ఐసీడీఎస్ లబ్ధిదారులకు ఎటువంటి టేక్‌హోం రేషన్ అందదని సంబంధిత అధికారులు చెప్పడంతో శనివారం అధిక సంఖ్యలో ఐసీడీఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. బాలింతలు, గర్భిణులు, 7 నెలల నుంచి మూడేళ్ల మధ్య ఉన్న చిన్నారులు 4,612 మంది ఉండగా వీరిలో అర్హులు 3,113 మంది ఎఫ్ఆర్ఎస్ చేయించుకోవాల్సి ఉంది. ఇప్పటివరకు 2,150 మంది మాత్రమే ఎఫ్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ నెలాఖరులోగా మిగిలిన వారంతా ఎఫ్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్టు సీడీపీఓ సిమ్మాలమ్మ తెలిపారు.

పోతే పంతానికి.. పాలన గాలికి!



- జిల్లాలో గాడి తప్పుతున్న పరిపాలన
- ప్రభుత్వ శాఖల్లో ఇష్టారాజ్యం
- ఎవరికి వారే యమునాతీరే..

సాక్షి, పార్వతీపురం మన్యం:

జిల్లాలో పరిపాలన గాడి తప్పుతోంది. ప్రభుత్వ శాఖల్లో ఎవరికి వారే యమునాతీరే అన్న చందాన అధికారులు, ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు. కొన్ని శాఖల్లో కుర్చీలాటలు జరుగుతుంటే.. మరికొన్ని చోట్ల ముష్టియుద్ధాలే సాగుతున్నాయి. నువ్వెంతంటే.. నువ్వెంత అనుకున్నంత వరకూ వ్యవహారం ఉంది. ప్రభుత్వ శాఖల్లో క్రమశిక్షణ లోపిస్తున్నా.. సరిదిద్దాల్సిన ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తుండగా, సయోధ్య కుదర్చాల్సిన ప్రజాప్రతినిధులు 'రాజకీయం' చేస్తున్నారు.

- పార్వతీపురం పురపాలక సంఘంలో కొద్దిరోజులుగా తీవ్రస్థాయిలో సిబ్బంది మధ్య విభేదాలు జరుగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్వో రూబిన్‌ల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం, రెవెన్యూ, ప్రజారోగ్యశాఖలోనూ విభేదాలు ఉన్నాయి. ప్రధానంగా కమిషనర్‌కు, మిగిలిన విభాగాల అధికారులకు మధ్య సమన్వయం కొరవడింది. ఇటీవల ఉద్యోగులు పలుమార్లు ఆందోళనలకు దిగారు. పెన్‌డౌన్ చేపట్టారు. ఇక్కడ ఎవరికి వారే యమునా తీరే అన్న చందాన వ్యవహరిస్తున్నారు. ఆ ప్రభావం మున్సిపల్ సేవలపై పడుతోంది. ఉద్యోగులు సైతం ఎవరూ సమయానికి విధులకు హాజరు కాని పరిస్థితి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.
- జిల్లా విద్యాశాఖ రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారింది. ప్రజాప్రతినిధులు తానా అంటే.. ఇక్కడి అధికారులు తందానా అంటున్నారు. ఒక్కొక్కరి వెనుక.. ఒక్కో ప్రజాప్రతినిధి ఉన్నారన్న విమర్శలు ఈ శాఖ సిబ్బంది నుంచే వినిపిస్తున్నాయి. సాక్షాత్తు డీఈఓ కుర్చీ కోసమే వివాదాలు రేగడం గమనార్హం. మరో ఉద్యోగి తనకున్న పలుకుబడితో ఏళ్ల తరబడి ఇక్కడే తిష్ట వేస్తూ, వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నారు. ఇక్కడ డీఈఓ తిరుపతినాయుడు మార్చి 31న ఉద్యోగ విరమణ చేశారు. మూడు నెలలు గడుస్తున్నా ఇంకా రెగ్యులర్ అధికారిని నియమించలేదు. డీఈఓ కార్యాలయంలో సహాయ సంచాలకులుగా ఉన్న రమాజ్యోతికి కొన్నాళ్లు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కొద్దిరోజులకే ఇన్‌చార్జి డీడీఈఓగా ఉన్న రాజ్‌కుమార్‌ను నియమిస్తూ, కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నియామకంపై విమర్శలు రావడంతో కొన్నాళ్లు ఆ ప్రక్రియ ఆగినా.. మరలా ఆయనకే బాధ్యతలు అప్పగించారు. దీని వెనుక జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడి ఉన్నట్లు సంఘాల నాయకులు చెబుతున్నారు.



పార్వతీపురం మన్యం కలెక్టరేట్

- సీతంపేట గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖలో రెండు రోజుల క్రితం ఈఈ పోస్టుపై కుర్చీలాట చోటుచేసుకున్న విషయం విదితమే. ప్రభుత్వమే తనను ఈఈగా నియమించిందని ఓ అధికారి.. కోర్టు ఉత్తర్వుల మేరకు తానే ఈఈగా కొనసాగుతానని మరో అధికారి ఛాంబర్‌లో వేర్వేరుగా కుర్చీలు వేసుకుని కూర్చోవడం గమనార్హం.
- గతంలో సాలూరు పట్టణ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సీటు వివాదమైన విషయం తెలిసిందే. ఇందులో రాజకీయ జోక్యం వల్ల పెద్ద దుమారమే రేగింది. చివరికి కోర్టు మెట్లు కూడా ఎక్కారు.
- ఇటీవల పార్వతీపురం తహసీల్దార్‌పై స్థానిక ఎమ్మెల్యే దూషణలకు దిగిన వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కార్యాలయంలో ఉన్న విభేదాలే దీనికి కారణమన్న విమర్శలున్నాయి. ఓ వర్గం ఎమ్మెల్యేకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చోద్యం చూస్తున్నారు..

ఈ నాలుగు విభాగాలే కాదు.. జిల్లాలోని పలు శాఖల్లో ఇదే పరిస్థితి ఉంది. రాజకీయ అండదండలున్న పలువురు ఉద్యోగులు, అధికారులు.. వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్నారు. వివాదాలను పరిష్కరించాల్సిన ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా శాఖల్లో వివాదాలు మరింత ముదురుతున్నాయి. ఉద్యోగులు పంతానికి పోతున్నారు. ఈ ప్రభావం పరిపాలన, అభివృద్ధిపై పడుతోందంటూ జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శుల పోరుబాట



పార్వతీపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శుల పడిగాపులు

- ఉదయం 6 గంటలకే విధులంటే ఎలా అంటూ ఆవేదన
- పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి

సాక్షి, పార్వతీపురం మన్యం: తమ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు పోరుబాటకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పలు మండలాల కార్యదర్శులు శనివారం విధులు బహిష్కరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు.. అనుమతి లేదంటూ వారిని అడ్డుకున్నారు. ఇక్కడ ఎటువంటి నిరసన కార్యక్రమాలూ చేయడానికి వీలులేదని స్పష్టం చేశారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి అనుమతి తీసుకురావాలని సూచించారు. దీంతో అక్కడ నుంచి కొంతమంది కార్యదర్శులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా.. మరికొంత మంది ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఎక్కడా వారి మొర వినేవారు లేకపోవడంతో వెనుదిరిగారు.

ఉదయం 6 గంటలకే విధులా..?

రోజూ ఉదయం 6 గంటలకే గ్రామాల్లో విధులకు హాజరై.. ఇంటింటి చెత్త సేకరణ, క్లోరినేషన్ చేసేటప్పుడు ఆ రోజు దినపత్రికతో ఫొటో దిగి, దానిని పంచాయతీరాజ్ శాఖ పోర్టల్‌లో అప్‌లోడు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కార్యదర్శులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నారు. ఈ నిర్ణయం తమను అవమానించేలా, అవహేళన చేసేలా ఉన్నాయంటూ వాపోతున్నారు. గతంలో వలంటీర్లు చేసిన కొద్దిపాటి సర్వేల భారమంతా తమపైనే వేస్తున్నారని.. దీనికితోడు స్వర్ణ పంచాయతీ పనులు, ఇంటి పన్నుల వసూళ్లు, పీఆర్ వన్ యాప్, రెవెన్యూ వారి పీజీఆర్ఎస్ పనులు, గ్రామసభలు, జీపీ సమావేశాలు, సంక్షేమ పథకాల అమలు, ఎన్నికల విధులు, ప్రోటోకాల్ వంటివి తామే చేయాల్సి వస్తోందని అంటున్నారు. దీనివల్ల తీవ్ర పని ఒత్తిడితో కుటుంబాలకు దూరమవుతున్నామని చెబుతున్నారు. గ్రామ పంచాయతీ విధులకు న్యాయం చేయలేకపోతున్నామని వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శుల మనోవేదన, విధుల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలని కోరుతున్నారు. పని వేళల్లో వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పీఎం సూర్యఘర్ లక్ష్యాలు సాధించాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో పీఎం సూర్యఘర్ కింద నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఎంపీడీఓలు, విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. సూర్యఘర్, జగా, పారిశుద్ధ్య నిర్వహణపై సంబంధిత అధికారులతో తన చాంబర్‌లో శనివారం సమీక్షించారు. ఈ నెలాఖరులోగా 1,000 సూర్యఘర్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంకాగా, 289 యూనిట్లను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉదయం 7 గంటల లోగా పారిశుద్ధ్య పనుల వివరాలను యాప్‌లో నమోదుచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ పథక సంచాలకులు ఎం.సుధారాణి, అధికారులు పాల్గొన్నారు.

శంబరలో 2,399 బస్తాల ఎరువు సీజ్

- ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు విజిలెన్స్ అధికారుల దాడులు



శంబర ఎరువుల దుకాణంలో సోదాలు నిర్వహిస్తున్న అధికారులు

మక్కువ: మండలంలోని శంబర గ్రామంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు చేశారు. ఎరువుల బస్తాపై రూ.50 నుంచి రూ.70వరకు అధిక ధర వసూలు చేస్తున్నారన్న రైతుల ఆవేదనపై 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ప్రాంతీయ నిఘా, అమలు అధికారి బి.ప్రసాదరావు ఆదేశాల మేరకు శంబర గ్రామం కొత్తవీధిలో ఉన్న శ్రీ సత్య సాయి ట్రేడర్స్‌ను విజిలెన్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఎరువులు అధిక ధరకు రైతులకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఎరువుల బౌతిక నిల్వలకు, స్టాక్ రిజిస్టర్‌కు వ్యత్యాసం ఉన్నట్లు నిర్ధారించారు. ఎఫ్‌సీఓ 1985, 28(1)డి, ఈసీ యాక్ట్ 1955 ప్రకారం కేసు నమోదు చేశారు. రూ.28,77,422లు విలువ కలిగిన 2,399 బస్తాలు (119.925 టన్నులు) ఎరువును సీజ్ చేశారు. దుకాణం స్టాక్ రికార్డులు, తాళాలు, ఈ పాస్ మిషన్‌ను ఏఓ చింతల భారతికి అప్పగించారు. వాటిని జేసీకి సోమవారం అప్పగిస్తామని ఏఓ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారి రామారావు, సబ్‌ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, పోలీస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తతే ప్రధానం


- త్వరలో దోమతెరలు పంపిణీ చేస్తాం
- మలేరియా నివారణ జోనల్ అధికారి మీనాక్షి




దోనుబాయి ఆశ్రమ పాఠశాలలో సిక్‌రూంను పరిశీలిస్తున్న జెడ్ఎంఓ

సీతంపేట: మలేరియా జ్వరాల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా నివారణ జోనల్ అధికారి (జెడ్ఎంఓ) బొడ్డేపల్లి మీనాక్షి వైద్యులకు సూచించారు. మండలంలోని దోనుబాయి పీహెచ్‌సీ, సీతంపేట ఏరియా ఆస్పత్రులను శనివారం సందర్శించారు. మలేరియాతో బాధపడుతున్న రోగులను పరామర్శించారు. మలేరియా వ్యాప్తిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షలు, వైద్య సేవల తీరుపై ఆరా తీశారు. దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన వసతి గృహ సిక్ రూంను తనిఖీ చేశారు. కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. బూర్జగూడలో మలేరియా పాజిటివ్‌తో బాధపడుతున్న వ్యక్తి ఇంటికి వెళ్లి పరీక్షించారు. దోమల వ్యాప్తిని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మలేరియా హైరిస్క్ గ్రామాల్లో విస్తృతంగా ఐఆర్ఎస్ 5 శాతం ఏసీఎం ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.ఎస్.ప్రసాద్, డీఎంఓ పి.వి. సత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయపార్వతి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు, కన్సల్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్కడ నర్సులే.. వైద్యులు!



కొమరాడ పీహెచ్‌సీలో వైద్యులులేక ఖాళీగా ఉన్న కుర్చీలు



వైద్యులు లేక విద్యార్థులకు వైద్యసేవలందిస్తున్న నర్సు

కొమరాడ: కొమరాడ పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సులే డాక్టర్లుగా సేవలందిస్తున్నారు. ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉన్నా శనివారం ఒక్కరు కూడా ఆస్పత్రికి రాకపోవడంతో రోగులు, బంధువులు ఆందోళనకు దిగారు. వ్యాధులు ముసురుకున్న వేళ ప్రతిరోజు 80 ఓపీ నమోదవుతోంది. ఈ సమయంలో వైద్యులు రాకపోతే ఎలా అంటూ నిలదీశారు. 24 గంటలు వైద్య సేవలు అందించాల్సిన పీహెచ్‌సీలో కనీసం పగటిపూట కూడా వైద్యులు సేవలందించకపోవడంపై గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం



వైద్యుల దినోత్సవం ఆహ్వానప్రతుల ఆవిష్కరణ

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ, సీతం ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా జూలై 1వ తేదీన జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నామని సీతం ఇంజినీరింగ్ కాలేజి డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు పేర్కొన్నారు. తోటపాలెం సత్య విద్యా సంస్థల వద్ద శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యుల దినోత్సవం ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. వైద్యులు ప్రాణదాతలని, సమాజంలో వారి స్థానం ఎల్లప్పుడూ గౌరవప్రదంగానే ఉంటుందన్నారు. సాంకేతికంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలతో ప్రపంచం ముందుకు వెళ్తుందని ఈ నేపథ్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై జాతీయ వైద్యుల దినోత్సవం నాడు ప్రముఖ వైద్యులతో అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, సత్య డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి దేవమణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఐదుగురు అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ రమణ, ఎస్‌ఐ మహేష్

బొండపల్లి: మండలంలోని గొట్లం బైపాస్ రోడ్డు మీదుగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకొని ఐదుగురు యువకులతో పాటు గంజాయిని సీజ్ చేసినట్టు సీఐ రమణ, ఎస్‌ఐ మహేష్ శనివారం తెలిపారు. కురుపాంకు చెందిన డి.కీర్తిరాజ్‌కుమార్, పి.అమర్, ఎం.అఖిల్, ఒడిశాకు చెందిన టి.రమేష్, ఇ.శ్యామ్‌లను అదుపులోకి తీసుకొని వారి నుంచి 1200 గ్రాముల గంజాయి, ఆరు సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు.

ఈవీఎం గొడౌన్ వద్ద పటిష్ఠ భద్రత : కలెక్టర్



ఈవీఎం గొడౌన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: ఈవీఎం గొడౌన్ వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద గల ఈవీఎం గొడౌన్‌ను ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ శనివారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎం గొడౌన్ భద్రతకు చేపడుతున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎంల గొడౌన్‌ను పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్టు రాజకీయ పక్షాల ప్రతినిధులకు తెలిపారు. అదే విధంగా ప్రతి మూడు మాసాలకు (త్రైమాసిక) ఒకసారి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలిసి గొడౌన్‌ను పరిశీలించడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. ఈవీఎం గొడౌన్ వద్ద లాగ్ బుక్‌లను పరిశీలించి, లాగ్‌బుక్‌లో అందరికీ అర్థమయ్యేలా వివరాలు నమోదు చేయాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను, భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకులంలో ఇంటర్ విద్యకు మంగళం

- నీట్, ఐఐటీ బ్యాచ్‌ల పేరుతో రెగ్యులర్ ఇంటర్‌ను ఎత్తేశారు
- మూడు దశాబ్దాలుగా కొనసాగిన తరగతులు జరగవిక
- ఎంపీసీ, బైపీసీ కోసం జిల్లా శివారు ప్రాంతాలకు పరుగులు
- ఆవేదనలో గ్రామీణ ప్రాంత ఎస్సీ, ఎస్టీ కుటుంబాల బాలికలు



చీపురుపల్లిలోని బీఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాల

చీపురుపల్లి: 'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందట' అన్న చందంగా తయారైంది గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ పరిస్థితి. సాధారణంగా ప్రభుత్వాలు మారినప్పుడు గతంలో ఉన్న సౌకర్యాలు కంటే మరింత మెరుగైన సదుపాయాలు కల్పించడం చూస్తుంటాం. ప్రస్తుత కూటమి పాలనలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. దీనికి పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో మూడు దశాబ్దాలుగా ఉన్న రెగ్యులర్ ఇంటర్మీడియట్ కోర్సుకు మంగళం పాడడమే నిదర్శనం. చీపురుపల్లి గురుకుల బాలికల కళాశాలలో విద్యనభ్యసించేందుకు విద్యార్థినులు పోటీ పడేవారు. ఏటా ప్రవేశాల కోసం అధికమంది దరఖాస్తు చేసేవారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ కోర్సులు నిర్వహించడంలేదని తెలియడంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన బాలికలు ఆవేదన చెందుతున్నారు. కళాశాల గేటుకు వేలాడుతున్న రెగ్యులర్ ఇంటర్ లేదన్న నోటీస్ బోర్డును చూసి నిరాశతో వెనుదిరుగుతున్నారు. చీపురుపల్లి గురుకుల బాలికల కళాశాలను కేవలం నీట్, ఐఐటీ బ్యాచెస్‌కు కేటాయించారని, రెగ్యులర్ ఇంటర్ ఇక్కడ లేదని సిబ్బంది చెబుతున్నారు. నీట్, ఐఐటీ లాంటి ఉన్నత కోర్సులకు వెళ్లే విద్యార్థులు కోసం ప్రత్యేకంగా బ్యాచ్‌లు నడపడం మంచిదే అయినప్పటికీ, రెగ్యులర్ ఇంటర్ పూర్తిగా రద్దు చేయడం అన్యాయమని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జోనల్ స్థాయిలో ఒక నీట్, ఐఐటీ క్యాంపస్

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జోనల్ స్థాయిలో ఒక నీట్, ఐఐటీ క్యాంపస్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి విజయనగరం, విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి చీపురుపల్లి గురుకుల బాలికల కళాశాలలో ఆ క్యాంపస్‌ను ఏర్పాటు చేసి రెగ్యులర్ ఇంటర్‌ను రద్దు చేశారు. ఈ క్యాంపస్ గతంలో రాష్ట్ర వ్యాప్తంగా అమరావతిలో ఒక్కటే ఉండేది. తాజాగా జోనల్‌స్థాయిలో ఒక్కోటి ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో అది కూడా చీపురుపల్లిలో ఏర్పాటు చేయడంతో రెగ్యులర్ ఇంటర్‌కు మంగళం పాడేలా చేసింది. ఇక్కడ ఏర్పాటు చేసిన నీట్, ఐఐటీ క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ చదవాలనుకునే విద్యార్థులకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఎంట్రన్స్ కూడా నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు.

మూడు దశాబ్దాల చరిత్ర..

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 1984లో చీపురుపల్లి కేంద్రంగా గురుకుల బాలికల పాఠశాలను ఏర్పాటుచేశారు. తరువాత కాలంలో 1994లో గురుకుల బాలికల కళాశాలను ఏర్పాటు చేసి ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులను తీసుకొచ్చారు. 31 సంవత్సరాలుగా ఉన్న ఇంటర్మీడియట్ కోర్సు ఇప్పుడిక లేదు. పక్కనే నెలిమర్లలో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల ఉన్నప్పటికీ అక్కడ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు లేవు. దీంతో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు కావాలనుకునే చీపురుపల్లి, నెలిమర్ల, విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, రాజాం నియోజవకర్గాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన పిల్లలు జిల్లాలోని సుదూరంగా ఉన్న వేపాడ, వియ్యంపేట వంటి గురుకుల కళాశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకుంది.



రెగ్యులర్ ఇంటర్మీడియట్ లేదని కళాశాల వద్ద పెట్టిన నోటీస్ బోర్డు

రెగ్యులర్ ఇంటర్మీడియట్ లేదు....

జోనల్ స్థాయిలో ఏర్పాటు చేసిన నీట్, ఐఐటీ క్యాంపస్‌ను చీపురుపల్లి గురుకుల కళాశాలలో ఏర్పాటు చేశారు. దీంతో రెగ్యులర్ ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి ఇక్కడి సీట్లను ఇతర కళాశాలల్లో సర్దుబాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన నీట్, ఐఐటీ బ్యాచ్‌స్‌కు సంబంధించి సీట్లు కూడా పూర్తయ్యాయి.

– రాణీశ్రీ, ప్రిన్సిపాల్, గురుకుల కళాశాల, చీపురుపల్లి

మంత్రి ఉంటే ఆ మార్గం మూతే..!

- మంత్రి ఇంటి వద్ద ట్రాఫిక్ సమస్య
- రాకపోకలకు ఇబ్బందులు
- మంత్రి స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్న అఫీషియల్ కాలనీవాసులు



మంత్రి సంధ్యారాణి ఇంటివద్ద రోడ్డుపై వాహనాలు నిలిపివేయడంతో కారువెళ్లేందుకు మార్గంలేని దృశ్యం

సాలూరు: స్త్రీ శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నివాసముంటున్న సాలూరులోని అఫీషియల్ కాలనీ వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఆమెను కలిసేందుకు వచ్చిన పార్టీ నాయకులు రోడ్డుపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పార్టీ సమావేశాల సమయంలో నడిచేందుకు కూడా దారి ఉండని పరిస్థితి. రోడ్డుపై నిలిపిన వాహనాలను పక్కకు తీసుకుని తమ వాహనాలతో ముందుకువెళ్లాల్సి వస్తోంది. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోతోందని వాపోతున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కూడా స్థానికుల సమస్యపై స్పందించని మంత్రి తీరును తప్పుబడుతున్నారు.

రాజన్నదొరకూ దారి కరువే...

అదే మార్గంలో నిరంతరం ప్రయాణించే మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు కూడా తరచూ ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. మంత్రి సంధ్యారాణి ఇంటిముందు నిలిపిన వాహనాలను పక్కకు తీసి శనివారం వెళ్లాల్సి వచ్చింది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు మంత్రి తీరును దుమ్మెత్తిపోశారు. ఈ సమస్యపై రాజన్నదొర స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. సాధారణంగా ప్రజాప్రతినిధులు ఉన్నప్పుడు వారి ఇళ్లముందు ఇటువంటి ట్రాఫిక్ సమస్యలు ఉంటాయని, చొరవ తీసుకుని సమస్యను చక్కదిద్దాలన్నారు. తను డిప్యూటీ సీఎంగా పనిచేసిన సమయంలో బాధ్యతాయుతమైన పాలకుడిగా కాలనీవాసులకు ఏ ఒక్కరోజు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలను రోడ్డు పక్కగా పార్కింగ్ చేయాలని పార్టీ శ్రేణులకు సూచించేవాడినన్నారు. మంత్రి సంధ్యారాణి ఇంటి వద్ద ఏడాదిగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పట్టణ సీఐకు ఫోన్ చేసి విషయం చెప్పినా సరైన స్పందన లేదన్నారు. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే పోలీసులు, మీడియా వచ్చే వరకు తన వాహనాన్ని ట్రాఫిక్‌లో నిలుపుదలచేస్తానని, అప్పుడు అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో చూస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్‌పై వెళ్తున్న లారీ, బైక్‌లు ఢీకొనడంతో (రెండూ ఒకే వైపు)మండలంలోని శివడవలసకు చెందిన గణేష్ అనే యువకుడి కాలు నుజ్జు నుజ్జయింది. లారీని ఓవర్ టేక్ చేస్తుండగా ముందు చక్రం కింద పడటంతో తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలో చాలా సేపు ఉండిపోయాడు. అంబులెన్స్ రాక ఆలస్యం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్షతగాత్రుడ్ని ట్రాఫిక్ ఎస్‌ఐ పి.జ్ఞానప్రసాద్ సిబ్బంది జ్ఞానప్రసాద్ సిబ్బంది, ఇతరుల సాయంతో ఆటోలో ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు : ఎస్పీ

పార్వతీపురం రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి హెచ్చరించారు. పోలీసు అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాసాంతపు నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాన్ ఆఫ్ యాక్షన్, క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులు, నాన్‌బెయిలబుల్ వారెంట్లు తదితర వాటిపై స్టేషన్ల వారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల, కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధించడానికి యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ-చలానా, డ్రంకన్ డ్రైవ్ కేసులు ఎక్కువగా నమోదు చేయాలన్నారు. సారా, గంజాయి రవాణాపై దాడులను నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత నియామాలపై వినూత్న రీతిలో అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై, జూదం ఆడిన వారిపై స్థావరాలను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించేందుకు అనుమతి పత్రం తప్పకుండా తీసుకోవాలన్నారు. హెల్మెట్‌ధారణపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలపై, మహిళా సంబంధిత నేరాలపై, శక్తి యాప్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ట్రైనింగ్ ఐజీ కేవీ మోహన్‌రావు మాట్లాడుతూ పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో మహిళలపై దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకొనేలా చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో పాలకొండ డీఎస్పీ రాంబాబు, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సోషల్ మీడియా, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ అప్పారావు, ఎస్‌బీ సీఐ రంగనాథంతో పాటు పలువురు పాల్గొన్నారు.

అరుదైన జువెనరీ గ్లకోమా చికిత్స



శస్త్ర చికిత్స చేయించుకున్న మహిళ కుటుంబంతో డాక్టర్ కేవీ అప్పారావు

బొబ్బిలి: పట్టణంలోని బొబ్బిలి కంటి ఆసుపత్రిలో జాతీయ స్థాయి కంటి శస్త్రచికిత్సల నిపుణులు డాక్టర్ కేవీ అప్పారావు అరుదైన కంటి శస్త్ర చికిత్స నిర్వహించారు. పార్వతీపురానికి చెందిన నరేంద్ర పంగి అనే మహిళకు చిన్నతనంలోనే గ్లకోమా (జువెనరీ గ్లకోమా)వ్యాధి సోకింది. ఈమె విశాఖ తదితర ప్రాంతాల్లో పలు ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు పొందినా నయం కాలేదు. చూపు మరింత మందగించింది. చివరికి డాక్టర్ కేవీ అప్పారావు డాక్టర్‌ను కలసింది. ఆయన చికిత్స చేసి ఇది అరుదైన జువెనరి గ్లకోమా వ్యాధి అని శస్త్ర చికిత్స అవసరమని ఆ ప్రకారం చేయడంతో ఈమెకు కంటి చూపు 70శాతం పైగా వచ్చినట్టు తెలిపారు. అసలు నాకు కంటి చూపు వస్తుందని అనుకోలేదని, బొబ్బిలిలో చికిత్స చేయించుకోవడం వలన తాను మునుపటిలా చూడగలుగుతున్నానని డాక్టర్ అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ ఈమెకు 21 సంవత్సరాల వయసులోనే గ్లకోమా వచ్చిందన్నారు. ఇటువంటి వారికి వచ్చే అంధత్వాన్ని జువెనరీ గ్లకోమా వ్యాధి అంటారన్నారు. ఏమాత్రం దృష్టి లోపం ఉన్నా వెంటనే వైద్యుల్ని సంప్రదించాలన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ.6.70 లక్షల జరిమాన

విజయనగరం క్రైమ్ : డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 67 మంది వాహనదారులకు ఒకొక్కరికీ రూ.10 వేల చొప్పున విజయనగరం అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎంఎస్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తి విధించారని ఎస్పీ వకుల్ జిందల్ శనివారం తెలిపారు. విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. వీరికి రూ.6.70 లక్షల జరిమాన విధించారని తెలిపారు.

1850కి పైగా కేసుల నమోదు



టికెట్ లేని ప్రయాణాలు చేస్తున్న వారికి అపరాధ రుసుం విధిస్తున్న రైల్వే అధికారులు

విజయనగరం టౌన్: రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రత్యేక కార్యాచరణ ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో పూరి రథయాత్రకి వెళ్లి, వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై అధికారులు శనివారం విశాఖపట్టణం నుంచి విజయనగరం మీదుగా రైళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వెయిటింగ్ హాల్స్, క్యాటరింగ్ స్టాల్స్, ప్యాంట్రీకార్ల వద్ద ఆహార పదార్థాలను పరిశీలించారు. టికెట్ లేకుండా ప్రయాణాలు చేసే వారిపై దృష్టి సారించారు. 1850 మందికి పైగా టికెట్ లేకుండా ప్రయాణాలు చేస్తున్న వారిని గుర్తించి, వారి నుంచి రూ.11 లక్షలకు పైగా అపరాధ రుసుం వసూలు చేసినట్టు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ పేర్కొన్నారు. టికెట్ల కోసం సరైన క్యూలను నిర్వహించాలని, రైళ్లలో బోర్డింగ్ సులభతరం చేయాలని, క్యూఆర్ ఆధారిత కోడ్‌లతో డిజిటల్ చెల్లింపులను ఉపయోగించాలని, మండే వస్తువులను తీసుకువెళ్లవద్దని, టికెట్ తనిఖీ చేసినప్పుడు సరైన ఐడీ రుజువును చూపించాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు శనివారం పయనమయ్యారు. ఈ నెల 29నుంచి విజయవాడలో గల డీఎస్సీ ఇండోర్ స్టేడియంలో అండర్ – 10, 12 వయస్సుల విభాగాల్లో జరగనున్న పోటీల్లో సైబర్, ఇప్పి, ఫాయిల్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో జిల్లా నుంచి పడాల గణేష్, జాయ్ జబేజ్, టి.నరేంద్ర, హసీనా శ్రీవల్లి, మొహమ్మద్ షేక్ అహ్మద్ ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రీడాకారులను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డివి చారిప్రసాద్, సభ్యులు దాలిరాజు, పిల్లా శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు అభినందించారు.

తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లాకు క్రీడాకారులు మొత్తం 6 పతకాలు సాధించారు. ఈ నెల 23 నుంచి 25 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ఆరుగురు క్రీడాకారులు పాల్గొనగా.. ఆరుగురు క్రీడాకారులు పతకాలు సాధించటం విశేషం. పోటీల్లో షణ్ముఖ సిద్దార్థ గోల్డ్ మెడల్, హర్షవర్ధన్ సిల్వర్ మెడల్, వైష్ణవి దేవి సిల్వర్ మెడల్, రోహిణి బ్రాంజ్ మెడల్, హర్షిని బ్రాంజ్ మెడల్, తరుణ్ బ్రాంజ్ మెడల్ దక్కించుకున్నారు. అంతేకాకుండా అత్యధిక పతకాలు సాధించిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం దక్కించుకున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు దక్కించుకున్న జిల్లా క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావు, కోచ్‌లు, యశస్విని, కోటేశ్వరరావు అభినందించారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి



రైలు పట్టాల సమీపంలో మహిళ మృతదేహం

బాడంగి: మండలంలోని డొంకినవలస–బొబ్బిలి రైల్వే స్టేషన్ల మధ్య గొల్లాది మంగళ గేటు సమీపంలో రైలు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. బొబ్బిలి రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో సుమారు 45ఏళ్ల వయస్సు కలిగిన మహిళను రైలు ఢీకొనడం లేదా జారిపడి పోవడం వల్ల మృతి చెంది ఉంటుందని రైల్వే హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపారు. మృతురాలి శరీరంపై ఎరుపు, పసుపు రంగుచీర కలిగి ఉందని, గుర్తు పట్టడానికి ఎటువంటి ఆనవాళ్లు లేవని చెప్పారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచామని తెలిపారు. వివరాలు తెలిసిన వారు ఆర్‌పీఎస్‌ఎస్‌ఐ 9490617089 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పాముకాటుతో వృద్ధుడు..



పాముకాటుతో మృతి చెందిన తిరుపతిరావు (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఒప్పంగి గ్రామానికి చెందిన ఎప్పరిక తిరుపతి రావు(63) పాము కాటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. తిరుపతిరావు గ్రామ సమీపంలో పశువుల శాల వద్ద పెంచుతున్న కోళ్లను కప్పేందుకు శుక్రవారం సాయంత్రం వెళ్లగా అక్కడ నాగుపాము కాటేసింది. తిరుపతిరావు ఆ పామును అక్కడే కొట్టి చంపేశాడు. ఇంటికొచ్చి కుటుంబీకులకు తెలియజేయగా వైద్యం నిమిత్తం భద్రగిరి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే తిరుపతిరావు మృతి చెందినట్టు తెలిపారు. అనంతరం భద్రగిరి ఆసుపత్రి వద్ద పోస్టుమార్టం నిర్వహించి తిరుపతిరావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన నాల్గో వ్యక్తి అరెస్టు



నిందితుడు సత్యనారాయణ

విజయనగరం క్రైమ్ : ఉద్యోగాల పేరిట యువతను మోసం చేసిన కేసులో నాల్గో నిందితుడిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. 2022లో రైల్వే, డాక్‌యార్డులో ఉద్యోగాలిస్తామంటూ నలుగురు ముఠాగా ఏర్పడి నిరుద్యోగ యువత నుంచి డబ్బులు వసూలు చేశారు. అప్పట్లో అందిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ వెంకటరావు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో నాల్గో నిందితుడైన కొత్తవలసకు చెందిన కోసూరు శివ వెంకట సత్యనారాయణను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని సీఐ తెలిపారు. రూ.80వేలు రికవరీ చేసినట్టు తెలిపారు.

ఒక్క రోజు ఎస్‌ఐగా ఖాన్

- నలుగురు ఏఎస్‌ఐలకు పదోన్నతి



డీఐజీ గోపినాథ్ జెట్టీని కలిసిన ఎస్‌ఐగా పదోన్నతి పొందిన సర్దార్ ఖాన్

విజయనగరం క్రైమ్: విశాఖ పోలీస్ రేంజ్ పరిధిలో నలుగురు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ విశాఖ పోలీస్ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో బి.సురేష్ పార్వతీపురం మన్యం జిల్లాకు, డి.సత్యారావును శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. మిగిలిన ఇద్దరు కె. శ్రీనివాసరావు, సర్దార్ ఖాన్‌లను విజయనగరం జిల్లాకు కేటాయించారు. ఎస్‌ఐగా పదోన్నతి పొందిన సర్దార్ ఖాన్ భోగాపురం ఏఎస్‌ఐగా పని చేస్తున్నారు. ఈ మేరకు విశాఖ రేంజ్ డీఐజీ కార్యాలయంలో ఆయన్ను సర్దార్ ఖాన్ కలిసి అభినందనలు తెలిపారు. కాగా, ఎస్‌ఐగా పదోన్నతి పొందిన సర్దార్ ఖాన్ ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. 1982లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరిన సర్దార్ ఖాన్ 2009లో ఏఎస్‌ఐగా, ఇప్పుడు ఎస్‌ఐగా పదోన్నతి పొందారు. సోమవారం రిటైర్ కానున్నారు.